# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- సాయుధ బలగాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ చర్యలు చేపడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా అన్నారు.
- భారతీయ రైల్వే రేపటి నుంచి 164 ప్రత్యేక రైళ్లను నడపనుంది.
- వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి హానీ కలిగించే వారిపై జరిమానాలను రెట్టింపు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశానికి సేవలు అందించే సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వన్ ర్యాంక్... వన్ పెన్షన్.. (ఓఆర్ఓపీ)ని అమలు చేసి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా... దేశాన్ని రక్షించడానికి తమ జీవితాలను అంకితం చేసిన అనుభవజ్ఞులు, మాజీ సైనికుల ధైర్యానికి, త్యాగాలకు "వన్ ర్యాంక్ వన్ పెన్షన్" నివాళిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దశాబ్ద కాలంలో లక్షలాది మంది పింఛన్‌దారులు, వారి కుటుంబాలు ఈ పథకంతో లబ్ది పొందారని సామాజిక మాధ్యమంలో తెలిపారు. సాయుధ దళాల శ్రేయస్సుకు ఓఆర్ఓపీ ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా దేశ సైనికులకు కృతజ్ఞత తెలిపిన ప్రధానమంత్రి, సాయుధ బలగాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన 'యాంటీ టెర్రర్ కాన్ఫరెన్స్-2024' ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోమ్ మంత్రి మాట్లాడుతూ...

ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు బలమైన వ్యూహంతో ముందుకెళ్తున్నామని అన్నారు. 'దేశ అంతర్గత భద్రత కోసం సరిహద్దుల వద్ద ఎంతో మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దేశం కోసం ప్రాణాలర్పించిన వారందరికీ నివాళులర్పిస్తున్నామన్నారు. ఉగ్రవాద కార్యకలాపాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' నినాదంతో ముందుకెళ్తోందని, ప్రస్తుతం ప్రపంచం అంతా ఈ విధానాన్నే అనుసరిస్తోందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వే రేపటి నుంచి 164 ప్రత్యేక రైళ్లను నడపనుంది. పండుగలు నేపథ్యంలో ప్రయాణికులకు తిరుగు ప్రయాణం సౌకర్యార్థం ఈ ప్రత్యేక రైళ్లను నడపనుంది. అలాగే రానున్న 3 రోజుల్లో సుమారు 476 రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధం చేసింది. కాగా గత 36 రోజుల్లో 4 వేల 521 రైళ్లలో 65 లక్షల మంది ప్రయాణం చేశారని రైల్వే శాఖ వెల్లడించింది. భారతీయ రైల్వేలో బీహార్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్‌లకు 6 కోట్ల 85 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారని తెలిపింది. ఈ నెల 4వ తేదీన ఒకేరోజు మూడు కోట్ల మంది ప్రయాణికులను చేరవేస్తూ రైల్వే శాఖ మైలురాయిని సాధించిందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణానికి హానీ కలిగించే వారిపై జరిమానాలను రెట్టింపు చేస్తూ.. పర్యావరణం, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిసర ప్రాంతాలలో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కోసం ప్రభుత్వం కొత్త నిబంధనలను విడుదల చేసింది. దీని ప్రకారం 2 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు గతంలో రెండు వేల ఐదు వందల రూపాయలు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పుడు 5 వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. రెండెకరాల నుంచి ఐదెకరాల భూమి ఉన్న రైతులు ఒక్కో సంఘటనకు పదివేల రూపాయల చొప్పున పర్యావరణ పరిహారాన్ని చెల్లించాలి. 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు 30 వేల రూపాయల పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు ఇప్పుడున్న 33 శాతానికి బదులుగా 35 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ మేరకు ఆరాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. మధ్యప్రదేశ్‌లో మహిళలకు పెంచిన రిజర్వేషన్లు SC, ST, OBCలతో సహా అన్ని వర్గాలకు వర్తిస్తాయని, ప్రతి కేటగిరీకి 35 శాతం రిజర్వేషన్ పోస్టులు అదే కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థులకు ఇవ్వబడతాయని ఆ నోటిఫికేషన్ లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్ పూజ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సూర్యభగవానుని ఆరాధించే ఛత్ పండుగ సనాతన సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతితో మనకున్న బంధానికి ప్రతిబింబమని ఆయన అభివర్ణించారు. ఛతీ మాత ఆశీస్సులతో దేశం పురోగతి, శ్రేయస్సు సాధిస్తుందని ఉపరాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఛత్ పండుగలో భాగంగా 3వ రోజైన ఛత్ సంధ్య అర్ఘ్య పండుగ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఛత్ సంధ్య అర్ఘ్య పండుగ సరళత, సంయమనం, సంకల్పం అంకితభావానికి ప్రతీక అని సామాజికమాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలను, సౌభాగ్యాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన నియమావళిని, నిర్దేశిస్తే తప్ప మధ్యలో మార్చలేమని సుప్రీంకోర్టు ఈరోజు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభానికి ముందు ఒకసారి చేసిన నియమాలను మధ్యలో మార్చడం సాధ్యం కాదని పేర్కొంది. ఎంపిక నిబంధనలు ఏకపక్షంగా ఉండకూడదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని ధర్మాసనం పేర్కొంది. నిబంధనలను మధ్యలో మార్చడం ద్వారా అభ్యర్థులు ఇబ్బందులకు గురికాకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాంబియాలో కొనసాగుతున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో ఆదేశానికి 2,500 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సహాయాన్ని అందజేయనున్నామని భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. జాంబియాలోని లుసాకాలో జరిగిన జాంబియా-ఇండియా జాయింట్ పర్మనెంట్ కమిషన్ 6వ సెషన్‌లో ఈ అంశంపై చర్చించినట్లు ఆయన వెల్లడించారు. జాంబియా విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ సహకార మంత్రి ములాంబో హైంబేతో జరిగిన ఈ సెషన్‌లో, వ్యవసాయం, విద్య, ఇంధనం, రక్షణ, సంస్కృతితో సహా వివిధ రంగాలలో ఇరు దేశాల సహకారాన్ని ఇరువురు నాయకులు చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలలో పెరుగుతున్న వేగాన్ని ఇరుపక్షాలు ప్రశంసించాయని, వీటిని మరింత బలోపేతం చేయడానికి రెండు దేశాలు తమ నిబద్ధతను చాటాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ సంసిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో కలసి భారత్, అమెరికా ప్రజల అభివృద్ధి, శాంతి, భద్రతకు కృషి చేస్తారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 849 పాయింట్ల నష్టంతో 79,528.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 284 పాయింట్లు నష్టపోయి 24,199 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.37 స్థాయికి చేరింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74 డాలర్లు వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,672 వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, దక్షిణాఫ్రికా పురుషుల జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌ల టీ20 క్రికెట్ సిరీస్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ రేపు డర్బన్ వేదికగా జరుగనుంది. ఆఖరిగా ఇటీవల భారత్ గెలిచిన టీ-20 ప్రపంచకప్ లో ఈ రెండు జట్ల మధ్య టీ-20 మ్యాచ్ జరిగింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో కూడా గెలిచేందుకు సిద్ధమవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - భూటాన్ మధ్య పరస్పర సంబంధాలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ, అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఈ రోజు తమల్‌పూర్ జిల్లాలో భూటాన్ ప్రధానమంత్రి లియోంచెన్ దాషో షెరింగ్ టోబ్‌గే సమక్షంలో దర్రంగా ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్‌ను ప్రారంభించారు.

==============================